# ఋచీకుడు

ప్రాతఃకాలాన నదిలో స్నానమాచరించి వస్తున్న ఋచీకమహర్షి దృష్టి ఎదురుగా ఉన్న చెట్టుపైన కూచున్న పక్షుల జంటపైన పడింది. భగవంతుని సృష్టిలోని సహజ సౌందర్యానికి విస్తుపోతూ, మహర్షి కదలక అక్కడే నిల బడ్డాడు. ముక్కు ముక్కూ రాసుకుంటూ, ముచ్చట్లు చెప్పుకుంటున్న ఆ ప్రేమ జంటని చూస్తూ ప్రకృతి పరవశిస్తోందో, ఆ జంటే ప్రకృతిని చూసి పరవ శిస్తోందో అవగతం కాలేదు మహర్షికి. అలా చూస్తుండగానే రెండూ కలిసి రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయాయి.

భృగుమహర్షి కుమారుడు ఋచీకుడు. నిరంతరం శిష్య సాంగత్యంలో, వేదాధ్యయనంతో కాలం గడుపుతున్నాడు.

ఆరోజు స్నానానంతరం ఆశ్రయానికి రాగానే చాలా వెలితిగా అని పించింది ఋచీకుడికి. బ్రహ్మచర్యంతో తపోదీక్షతో బాగానే సాగింది జీవిత మని పించింది ఇంతవరకు. కానీ, జీవితంలో ఏదో లోపించిందని, జీవిత పరిపూర్ణ త్వానికి ఏదో తక్కువైందని ఈనాడనిపించింది. ఋచీకుడు ఆశ్రమమంతా కలియచూశాడు.

ఋషి కన్యలు ఆశ్రమంలో పూల మొక్కలకి నీళ్ళుపోస్తూ కనిపించారు. వాకిట తీర్చిదిద్దిన రంగవల్లులు ఎంతో శోభాయమానంగా కనిపిస్తున్నాయి. ఋచీకుడు తన ఆశ్రమంలోకి అడుగుపెట్టాడు. ఆశ్రమమంతా వెలవెల పోతున్న ట్లనిపించింది ఆనాడెందుకో.

మనిషి జీవితంలో అన్ని దశలూ దాటాలి. అలా దాటుతూనే తామరాకు పైన నీటిబొట్టులా జీవితం గడపాలి. ఇంతవరకూ తను తపోధనుడై ఆశ్రమ జీవితంతో ధన్యత చెందాడు. ఇక గృహస్థాశ్రమ జీవితం ఎందుకు చేపట్టకూడదూ? గృహస్థుడుగా తన జీవితం పండి, సంతానవంతుడై తన వంశాన్ని తరింపజేస్తే? ఋచీకుని శరీరం గగుర్పాటు చెందింది.

ఋచీకుని ఆలోచనలు గృహస్థాశ్రయం వైపు పరుగులు తీయసాగాయి. వయసు మీరిపోకుండా తను వివాహం చేసుకోవాలి. ఇప్పటికే తను ఆలస్యం

చేశాడు అనుకుంటూ ఋచీకుడు తను వివాహమాడటానికి తగిన కన్య ఎవరో అని తలపోయసాగాడు.

ఇంతకుముందు కన్యలనెందరినో తను చూశాడు. అప్పుడెప్పుడూ తనకి వివాహపు ఆలోచన రాలేదు. ఈనాడు తాను వివాహం చేసుకుందామని నిశ్చయించుకుంటే, ఒక్క కన్యకూడా తనకు గోచరించదెందుకో? ఋచీకుడు తలపుల దొంతరలోంచి పైకి కనవచ్చింది సత్యవతి!

మహా తపోధన సంపన్నుడై, ఋషీశ్వరుడై, పేరు ప్రఖ్యాతులు గాంచిన గాధి కూతురు సత్యవతి. ఆమె సత్ప్రవర్తన, ఆమె రూప రేఖా విలాసాలు ఋచీకునికి తెలుసు ఇంతకు ముందు. ఆమె తనకి అనుకూలవతి. ఆమెను గురించిన ఆలోచన రావటం, అది అతని మనసుని ఆక్రమించుకోవటం, ఆమె తనకు తగిన భార్య అవే భావం స్థిరపడిపోవటం క్షణాలపైన జరిగిపోయింవి. అతని మనసు ఆమెపైన లగ్నమైపోయింది.

ఆమె ఒక ఋషి కుమార్తె. మరో మహర్షి అర్ధాంగి కావటానికి ఎందుకు అంగీకరించదు? తన కోరికని మహర్షి మాత్రం ఎందుకు తిరస్కరిస్తాడు?

సత్యవతే తన అర్ధాంగి కావాలని నిశ్చయించుకున్న ఋచీకుడు ఇక ఆలసించదలచలేదు తన ప్రయత్నానికి.

ఋచీకుడు ఎంతో ఉత్సాహంతో గాధి ఆశ్రమంలో అడుగు పెట్టాడు. జుట్టు ఆరబెట్టుకుంటూ నీరెండలో కూచున్న సత్యవతి అతని కళ్ళకి వనలక్ష్మిలా కనిపించింది ఆ క్షణం. సత్యవతి ఋచీకుని రాక గమనించి వెంటనే లేచి నిలబడింది. లోపలికి ఆహ్వానించింది. సత్యవతి నల్లని కళ్ళు అతని మనసుని గిలిగింతలు పెట్టాయి. ఆమె అడుగుల సవ్వడి అతనికి మధురంగా తోచింది. బ్రహ్మ ఆమెను తనకోసమే సృష్టించాడని అనుకుంటూ, ముందుకు అడుగు వేయబోతున్న ఋచీకునికి ఎదురొచ్చి సాదరంగా లోనికి తీసికెళ్ళాడు గాధి మహాముని.

అతిథి మర్యాదలు చేసి "తమ రాకతో నా గృహం పావనమైంది" అన్నాడు. ఋచీకుడు తపస్సంపన్నుడని గాధికి తెలుసు.

"నేను కన్యార్థినై వచ్చాను." ఋచీకుడు లోపల గుమ్మంలో నిలుచున్న సత్యవతి వంక చూస్తూ అన్నాడు.

గాధికి ఈ మాటలు అర్థం కాలేదు. ఋచీకుడు బ్రహ్మచర్య దీక్షాపరుడుగా పేరొంది, కన్యార్థిగా తన ఇంటికి రావటమేమిటో తెలియలేదు. సత్య

వతిని ఋచీకునికిచ్చి వివాహం చేయటమా? ఋచీకుని వయసూ, అతని నియమ నిష్ఠలూ తెలిసిన తను యౌవనవతి అయిన తన కుమార్తె నిచ్చి ఎలా వివాహం చేస్తాడూ? గాధి ఋచీకుడికి ఏ సమాధానమూ చెప్పక ఊరుకున్నాడు.

"మీ కుమార్తె సత్యవతి నాకు తగిన భార్యగా నా మనసు చెప్తోంది. గృహస్థాశ్రమంలో అడుగిడదామనే ఆలోచన రాగానే నా మనసు సత్యవతిపైననే లగ్నమైంది."

ఋచీకుని మాటలు భయాన్ని గలిగించాయి గాధికి. ఇతని మనసు బాధ పడకుండా, ఇతను అవమానపడకుండా ఎలా ఈ పరిస్థితినుంచి తప్పించుకోవాలి? అంతేకాదు, తనంతగా తాను కన్యను కోరితే తండ్రిగా తను కాదంటే ఏ ఆపద వాటిల్లుతుందో? ఋచీకుడు ఆగ్రహించి ఈ సత్యవతిని మరెవరూ వివాహమాడ రాదని శాసిస్తే? శపిస్తే? గాధి మనసు పరిపరివిధాల పోయింది. ఏదో ఉపాయంతో ఈ వివాహం తప్పించాలని నిశ్చయించుకున్నాడు గాధి.

"నా చిన్నకోరిక తమరు తీరుస్తే"-గాధి నెమ్మదిగా అన్నాడు.

"ఏ కోరికైనా వెంటనే తీరుస్తాను..." అనాలోచితంగా, సత్యవతిపైన లగ్నమైన మనసు ఉద్రేకపడుతుంటే అనేశాడు ఋచీకుడు.

"అయితే వేయి గుర్రాలు తీసుకువస్తే"-నవ్వుతూ అన్నాడు గాధి.

"ఓ, అదెంతపని?" లేవబోయాడు ఉత్సాహంగా ఋచీకుడు.

"ఆగాగు. ఒక చెవి నలుపు, శరీరమంతా తెల్లని తెలుపు: అలాటివి వెయ్యి గుర్రాలు. నువ్వు నాకు చెల్లించాల్సిన కన్యాశుల్కమది." గాధి ఋచీకుని వంక చూశాడు.

ఋచీకునిలోని ఉత్సాహం ఒక్కసారిగా చల్లబడిపోయింది. వేయి గుర్రాలు తేగలడు కానీ, నల్లని నలుపున్న చెవి, తెల్లని తెలుపున్న శరీరం- అదికూడా ఒకటా, రెండా-వెయ్యి!

ఋచీకుడు నెమ్మదిగా లేచి బయటికి నడిచాడు. తండ్రి కోరిక అర్థంలేని కోరిక. సత్యవతి మనసులో బాధ కలిగింది. అతనిపైన భక్తి గౌరవాలు పెంచుకున్న ఆమె కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

ఋచీకుడు బయటకు నడవగానే గాధి తృప్తిగా నిట్టూర్చాడు. ఆ కన్యాశుల్కం అతడు చెల్లించనూ లేడు, సత్యవతిని ఆ ఋషికిచ్చి తను వివాహమూ చేయక్కర్లేదు. హాయిగా ఊపిరి తీసుకున్నాడు గాధి.

రోజులు గడిచాయి. నిరాశనుంచి తేరుకున్నాడు ఋచీకుడు. సత్యవతిని ఎలాగైనా చేపట్టాలనే పట్టుదల పెరిగింది. మహా తపోబలసంపన్నుడైన తను సత్యవతిని ప్రేమించి విఫలుడవటమా? అసంభవం! తపోశక్తి సంపన్నుడైన తను ఏది సాధించలేడు కనక? ఋచీకునిలో కొత్త ఉత్సాహం ఊపిరి నింపింది.

ఇష్టుడూ, స్నేహితుడూ అయిన సముద్రాధిపతి వరుణుని ప్రార్థించాడు ఋచీకుడు.

"గంగానదికి ఉత్తరాన, కన్యాకుబ్జ సమీప ప్రాంతంలో నీకు ఆలాటి గుర్రాలు లభిస్తాయి. అందుకే ఆ ప్రాంతాన్ని అశ్వతీర్థ మన్నారు'' అంటూ ఋచీకుని సమయానికి ఆదుకున్నాడు వరుణుడు.

పరమానంద భరితుడై ఆశ్రమంలో అడుగుపెట్టిన ఋచీకుని చూసి విస్తుపోయాడు గాధి. నిజంగానే తను కోరినట్లుగా, నల్లని చెవి, తెల్లని శరీరం వున్న వేయిగుర్రాలు కళ్ళముందు కదులుతుంటే అది కలో, నిజమో అర్థంకాక తికమక పడ్డాడు గాధి.

కానీ, సత్యవతిమీద ప్రేమతో, ఇంత అసాధ్యమైన పనిని శక్తి యుక్తులతో సాధించిన ఋచీకునిపట్ల ఎడతెగని గౌరవం కలిగింది గాధికి. ఆతని తపోబలానికి ఆశ్చర్యపోయాడు.

ఇంతటి మహానుభావుడు తనకు అల్లుడు కావటంకన్న మించిన అదృష్టం వేరొకటి లేదనిపించింది గాధికి. ఇంతటి మహర్షికి భార్య కావటం తన కూతురు భాగ్యమని సంతసించి, సత్యవతీ ఋచీకుల వివాహాన్ని వైభవోపేతంగా జరిపించాడు గాధి.

సత్యవతిని చేపట్టి, విజయగర్వంతో గృహస్థాశ్రమంలోకి అడుగుపెట్టాడు ఋచీకుడు. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం :
అనుశాసనిక పర్వం : ప్రథమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 23-3-1988)